
నేడు కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న ఆర్థికమంత్రి

- సీతారామన్‌పై ఉమ్మడి జిల్లా వాసుల ఆశలు
- ప్రధాని ప్రకటించిన పసుపుబోర్డుపై స్పష్టత కరువు
- బడ్జెట్‌లో నిధులు కేటాయించాలంటున్న రైతులు
- కొత్త రైళ్లు, రైల్వే లైన్, డబ్లింగ్‌పై గంపెడాశలు
- జక్రాన్‌పల్లి విమానాశ్రయంపైనా భారీ అంచనాలు
- వరాల మూట కోసం జిల్లావాసుల ఎదురుచూపు

# నిర్మలమ్మ కరుణించేనా?



నిజామాబాద్, జూలై 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో నేడు బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో అందరి దృష్టి అటువైపే నెలకొంది. వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత బీజేపీ నేతృత్వంలో ఎన్డీయే సర్కారు ప్రవేశపెట్టే తొలి బడ్జెట్‌పైనే అంతటా చర్చ జరుగుతున్నది. ప్రధానంగా పన్ను రాయితీలతో పాటు సామాన్యులపై ఏమేరకు వరాలు కురిపిస్తారన్న అంశంపై ఆసక్తి ఏర్పడింది. అలాగే, ఉమ్మడి జిల్లాకు బడ్జెట్‌లో ఏమాత్రం ప్రాధాన్యం దక్కుతుందన్నది చర్చనీయాంశమైంది. నిజామాబాద్, కామారెడ్డి రైతుల సుదీర్ఘ కల అయిన పసుపుబోర్డుకు నిధులు, కొత్త రైళ్లు, రైల్వే లైన్లు, డబ్లింగ్ తదితర అంశలపై ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. జక్రాన్‌పల్లిలో విమానాశ్రయ ఏర్పాటు ప్రతిపాదన ఈసారైనా పట్టలెక్కిస్తారా.. లేదా? అన్న దానిపై ఆసక్తి నెలకొంది.

## పసుపు బోర్డుకు నిధులిచ్చేనా?

పసుపు రైతుల దశాబ్దాల కలను నెరవేరుస్తున్నామని, పసుపుబోర్డు ఏర్పాటు చేస్తున్నామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేసి 10 నెలలు పూర్తయ్యింది. మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో నిర్వహించిన సభల్లో ఆయన ఈ ప్రకటన చేశారు. కానీ ఇప్పటివరకు పసుపుబోర్డు స్థాపనలో కదలిక లేదు. బోర్డుకు పైసా విదిల్చింది. అసలు ఎక్కడ ఏర్పాటు చేస్తారన్న ప్రస్తావనే లేదు. కేంద్ర బడ్జెట్‌లో బోర్డుకు నిర్మలమ్మ నిధులు కేటాయిస్తారా? అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. 2019, 2023 ఎన్నికల్లో పసుపుబోర్డు అంశంతోనే బీజేపీ రెండుసార్లు నిజామాబాద్ లోక్‌సభ స్థానాన్ని కైవసం చేసుకున్నది. గతంలో రైతులను మోసం చేసిన ఎంపీ అర్వింద్.. ఈసారైనా నిధులు తీసుకొస్తాడా? అని రైతాంగం ఎదురు చూస్తున్నది.

## రైళ్లకు మోక్షమెప్పుడో..

రైళ్ల అభివృద్ధిలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎప్పుడూ వెనుకబాటులోనే ఉంది. వాణిజ్యానికి ప్రధాన కేంద్రంగా రూపాంతరం చెందుతున్నప్పటికీ నిజాం కాలంలో వేసిన రైల్వే లైన్ మినహా ఇతరత్రా అభివృద్ధి అన్నది మచ్చుకైనా లేదు. 2014 నుంచి 2019లో ఎంపీగా కల్వకుంట్ల కవిత తీవ్ర పోరాటం చేసి పెద్దపల్లి – నిజామాబాద్ రైల్వే లైన్ పనులు పూర్తి చేయించారు. ఆ తర్వాత రెండుసార్లు ఎంపీగా గెలిచిన అర్వింద్ మాత్రం తనదైన ముద్ర వేసుకోలేకపోయారు. దేశ వ్యాప్తంగా చేపడుతున్న ప్రాజెక్టుల్లో భాగంగానే నిజామాబాద్ వరకు రైల్వే ఎలక్ట్రిఫికేషన్ జరిగింది. ఇందులో అర్వింద్ పాత్రేమీ లేదు. నిజామాబాద్ నుంచి సికింద్రాబాద్, ముంబైకి రైళ్ల సంఖ్యను పెంచాలని జిల్లా ప్రజలు చాలా ఏండ్లుగా కోరుతున్నారు. ఈమార్గంలో అరకొర రైళ్లను మాత్రమే నడుపుతున్న రైల్వేశాఖ గూడ్స్ రైళ్లను విరివిగా తిప్పుతూ భారీగా లాభాలను ఆర్జిస్తోంది. కానీ, ఈ ప్రాంత ప్రజల సౌకర్యాలను పట్టించుకోవడం లేదు. ఇక, డబ్లింగ్ లేకపోవడంతో ప్యాసింజర్ రైళ్ల రాకపోకల్లో తీవ్ర ఆలస్యమవుతున్నది. గూడ్స్ రైళ్లకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ప్యాసింజర్ రైళ్లను ఎక్కడికక్కడ నిలిపేస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా సమస్యలను తీర్చేలా బడ్జెట్‌లో కొత్త రైళ్లు, డబ్లింగ్‌పై ప్రకటనపై జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

## విమానాశ్రయానికి మోక్షం కలిగేనా?

జక్రాన్‌పల్లిలో విమానాశ్రయ ఏర్పాటు కలగానే మారింది. గతంలో కాంగ్రెస్, పదేండ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టుపై ఎటూ తేల్చలేదు. జక్రాన్‌పల్లిలో ఎయిర్ స్ట్రిప్ కోసం కేసీఆర్ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేసింది. సీఎం కేసీఆర్ ఢిల్లీ పర్యటనలో అనేక మార్లు జక్రాన్‌పల్లి ఎయిర్ పోర్టుపై కేంద్రానికి విన్నవించారు. కానీ, మోదీ సర్కారు కనికరించలేదు. జీఎమ్మార్ ఎయిర్‌పోర్టుతో ఉన్న ఒప్పందాన్ని సాకుగా చూపి విమానాశ్రయ ఏర్పాటుపై అడుగు ముందుకు వేయడం లేదు. ఈ బడ్జెట్‌లోనైనా జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టుపై ప్రకటన వస్తుందేమోనన్న ఆశతో ఈ ప్రాంత ప్రజలు ఎదురు చూస్తున్నారు.

అర్హత ఉన్నా మాఫీ రాకపోవడంపై అన్నదాతల ఆగ్రహం

# రుణమాఫీ మాకెందుకు రాలే..?

- బ్యాంకులు, వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు
- సర్కారు తీరుపై మండిపడుతున్న కర్షకులు



రుణమాఫీ అయ్యిందో లేదో తెలుసుకోవడానికి వచ్చిన ఖాతాదారులతో కిటకిటలాడుతున్న కోటగిరిలోని స్టేట్‌బ్యాంక్

"నేను ఇరవై వేల లోన్ తీసుకున్న.. మాఫీ కాలేదు... నా లోన్ రూ.లక్షలోపే ఉన్నది.. లిస్టులో పేరు రాలేదు... లోన్ రెన్యువల్ చేస్తూ వస్తున్న.. అయినా మాఫీ కాలేదు.. అన్ని కరెక్టుగా ఉన్నాయి...ఆఫీసర్లను అడిగితే మాకేం తెల్వదంటున్నారు..."

ఇవన్నీ మూడు రోజులుగా బ్యాంకుల వద్ద రైతుల నుంచి వస్తున్న మాటలు. ప్రతి బ్యాంకు వద్ద నిత్యం రైతుల వెంట ఇవే వ్యాఖ్యలు. రాష్ట్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన రుణమాఫీ పథకం..అర్హులమైనా తమకు లబ్ధి చేకూరడం లేదంటూ చాలా మంది రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్న చందంగా రూ.లక్ష లోపు ఉన్న రైతులందరికీ మాఫీ చేస్తామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా.. అవి నోటి మాటలకే సరిపోవడం, అమలుకు నోచుకోకపోవడంతో అన్నదాతలు మండిపడుతున్నారు. అన్నీ సక్రమంగా ఉన్నా.. ఏదో ఒక సాకు చూపి మాఫీ రాలేదని చెబుతున్నారని, కొంతమంది అధికారులను అడిగితే మాకేం తెల్వదంటూ సమాధానమిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – కోటగిరి, జూలై 22



## అర్హత ఉన్నా లిస్టులో పేరు రాలే..

కోటగిరి, జూలై 22: నేను చిన్న రైతును. నాకు కొత్తపల్లి శివారులో 38 గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. మూడేండ్ల కిందట కోటగిరి ఎస్‌బీఐ బ్యాంక్‌లో రూ.57,500 పంట రుణం తీసుకున్న. కాంగ్రెస్ సర్కారు ప్రతి రైతు కుటుంబానికి రూ. రెండు లక్షల రుణమాఫీ చేసినట్లు ప్రకటించింది. గురువారం రూ.లక్షలోపు క్రాప్ లోన్ ఉన్న వాళ్లకు మాఫీ చేస్తామని చెప్పింది. కానీ సర్కారు ఇచ్చిన మొదటి జాబితాల నా పేరు లేదు. ఎందుకు రాలేదో అని అడిగితే ఎవరూ తెల్వదంటున్నారు.

**- కోటగిరి పెద్ద సాయిలు, రైతు, కొత్తపల్లి, కోటగిరి మండలం**

## నాకెందుకు కాలేదో తెలుస్తలేదు..



కోటగిరి, జూలై 22: నాకు కొత్తపల్లి శివారులో 18 గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. కోటగిరి సహకార బ్యాంకులో 10 నెలల కిందట రూ.19వేలు క్రాప్‌లోన్ తెచ్చుకున్న. లక్షలోపు రుణాలు అన్నీ మాఫీ అవుతాయ్ అన్నరు. నా అప్పు కూడా మాఫీ అయితదని సంబురపడ్డ కానీ, వాళ్లు ఇచ్చిన లిస్టుల నా పేరు లేదు. నా కన్నా ఎక్కువ ఉన్నోళ్లకు మాఫీ వచ్చింది. నాతోపాటు లోన్ తీసుకున్న ఇద్దరికీ మాఫీ వచ్చింది కానీ నాకెందుకు రాలేదో.. తెలుస్తలేదు. ఇట్లయితే ఎట్ల? నాకు మాఫీ అయ్యేటట్లు చూడాలె.

**- సంగని గంగామణి, మహిళా రైతు, కొత్తపల్లి, కోటగిరి మండలం**

## రూ.36వేలకు మాఫీ రాలేదు..



సారంగాపూర్, జూలై 22: నాకు ఒక ఎకరం భూమి ఉన్నది. ఐడీబీఐ బ్యాంకులో పాసు పుస్తకం పెట్టి ఐదేండ్ల కిందట రూ.36 వేలు క్రాప్‌లోన్ తీసుకున్నాను. లోన్ మాఫీ లిస్ట్‌లో నా పేరు రాలేదు. బ్యాంకు, వ్యవసాయ అధికారులకు అడిగితే ఇప్పుడైతే లిస్టులో పేరు రాలేదు. తర్వాత వస్తదేమో జర ఆగుమని చెప్పిండ్రు. నాలాగా మా ఊళ్లో చాలా మంది రైతులకు మాఫీ రాలేదు. మాఫీ వస్తదేమోనని కండ్లు కాయలుకాసేలా ఎదురుచూసినా గానీ ఏం లాభం లేకుండా పోయింది. ఇప్పటికే ఈ కాంగ్రెస్ సర్కారు రైతుబంధు డబ్బులు ఇయ్యలేదు. అయినా అప్పు చేసి పంటలు వేసినం. అయినా కేసీఆర్ సారే బాగుండే. టైమ్‌కి రైతుబంధు డబ్బులు ఇచ్చిండు. గందరగోళం లేకుండా లోన్లు మాఫీ చేసిండు. కాంగ్రెసోళ్లు ఊరుకులాడుడు తప్ప రైతులకు మేలు చేసిందేమీ లేదు.

**- బానోత్ సామ్యానాయక్, రైతు, మల్కాపూర్ తండా, నిజామాబాద్ రూరల్**

## జీవనభృతి పెంచాలి



కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, జీవనభృతిని రూ.4వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బీడీ కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. నేతలు బండారు మల్లేశ్, శంకర్, నాగమణి తదితరులు పాల్గొన్నారు.



బోర్లం క్యాంపులో ఏర్పాటు చేసిన శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

# బోర్లం క్యాంపులో ప్రత్యేక వైద్య శిబిరం

- రోగుల వివరాలు సేకరించిన సిబ్బంది
- దోమల నివారణకు థీమోపస్ ద్రావణం పిచికారీ

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్



బాన్సువాడ రూరల్, జూలై 22: 'మంచం పట్టిన బోర్లం' క్యాంపు అనే శీర్షికతో నమస్తే తెలంగాణ దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపు గ్రామం లో పలువురికి జ్వరం, కీళ్లనొప్పులు, విషజ్వరాలు ప్రబలడంతోపాటు ఒకరికి చికున్‌గున్యా నిర్ధారణ అయ్యింది. దీంతో హన్మాజీపేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కీళ్లనొప్పులు, జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు చేసి కావాల్సిన మందులను ఉచితంగా అందచేశారు. వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు ఇంటింటికీ తిరుగుతూ బాధితుల వివరాలను సేకరించారు. గ్రామంలో వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు, దోమల నివారణకు థీమోపస్ ద్రావణాన్ని మురికి కాలువలు, ఇంటి పరిసరాల్లో పిచికారీ చేయించారు. ఎంపీహెచ్‌వో సుధాకర్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బోర్లం క్యాంపులో ప్రత్యేక వైద్య శిబిరాన్ని చేశామని, ఇంటింటికీ తిరుగుతూ 14మంది రోగుల రక్త నమూనాలను సేకరించినట్లు తెలిపారు. గ్రామంలో ఒకరికి చికున్ గున్యా నిర్ధారణ కావడంతో అప్రమత్తమై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వైద్య శిబిరంలో హెచ్‌ఈవో సాయిలు, జీపీ సెక్రటరీ పరిపూర్ణ, వైద్య సిబ్బంది హిమబిందు, కారోబార్ వినయ్‌కుమార్, శివయ్య, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# కొట్టేసిన సొమ్ము బెట్టింగ్‌లోకి..?

- స్టాక్‌మార్కెట్‌లోనూ పెట్టిన మేనేజర్!
- కోట్లు కొల్లగొట్టి పరారైన అజయ్
- అదుపులోకి తీసుకుని విచారిస్తున్న పోలీసులు
- ఠాణాకు తరలివచ్చిన బాధితులు



సోమవారం రాత్రి 10 గంటలకు పోలీసుస్టేషన్‌లో పడిగాపులు కాస్తున్న బాధితులతో మాట్లాడుతున్న సీఐ

వినాయక నగర్, జూలై 22: కస్టమర్ల ఖాతాల నుంచి రూ.కోట్లు కొల్లగొట్టి పరారైన యూనియన్ బ్యాంక్ మేనేజర్ అజయ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కొట్టేసిన డబ్బు ఏం చేశాడు.. ఎక్కడ దాచాడనే దానిపై ప్రశ్నిస్తున్నారు. అయితే, బెట్టింగ్‌తో పాటు స్టాక్ మార్కెట్‌లో పెట్టినట్లు విశ్వసనీయంగా తెలిసింది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ మేనేజర్ అజయ్.. రుణాల పేరిట 25 మంది కస్టమర్లను బురిడీ కొట్టించి రూ.4 కోట్లకు పైగా కాజేసిన సంగతి తెలిసిందే. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు ఎట్టకేలకు నిందితుడ్ని అదుపులోకి తీసుకుని నిజామాబాద్‌కు తరలించారు. ఏసీపీ రాజావెంకటరెడ్డి పర్యవేక్షణలో సీఐ నరహరి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు అజయ్‌ను సుదీర్ఘంగా ప్రశ్నించినట్లు సమాచారం. అయితే, తన వద్ద ప్రస్తుతం డబ్బులు లేవని మేనేజర్ చెప్పినట్లు తెలిసింది. కాజేసిన సొమ్మును ఏం చేశాడనే కోణంలో ఆరా తీసేందుకు యత్నిస్తుండగా, నిందితుడు సహకరించలేదని సమాచారం. మరోవైపు, మేనేజర్‌ను పట్టుకొచ్చారని తెలిసిన బాధితులు ఉదయమే ఠాణా వద్దకు చేరుకున్నారు. రాత్రి పొద్దుపోయే వరకు అక్కడే పడిగాపులు కాశారు. ఒక్కొక్కరిని ఏ విధంగా మోసగించాడో బాధితులు పోలీసుల వద్ద వెల్లడించారు. ముద్ర లోన్ కోసం ఓ వ్యక్తి సంప్రదించగా, డాక్యుమెంట్లు సహా అన్ని తాను చూసుకుంటానని చెప్పిన మేనేజర్ అజయ్.. రూ.8 లక్షల రుణం మంజూరయ్యేలా చూశాడు. అయితే, తనకు డబ్బు అవసరముందని, మూడు నెలల తర్వాత తిరిగి ఇస్తానని, అప్పటిదాకా వడ్డీ తానే చెల్లిస్తానని చెప్పి తీసుకున్నాడు. మిగతా బాధితులు వద్ద కూడా ఇలాగే సొమ్ము తీసుకున్నట్లు తెలిసింది.

## వాగులో నిరసన



రామారెడ్డి మండల కేంద్రంలోని గంగమ్మ వాగుపై బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం ధర్నా చేశారు. వాగులో నిలిచిన వర్షపు నీటిలో నిల్చొని నిరసన తెలిపారు. పదినెలల క్రితం అప్పటి ఎమ్మెల్యే జాజాల బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయగా.. కాంట్రాక్టర్ పనులు చేపట్టడంలో అలసత్వం వహిస్తున్నాడని ఆరోపించారు. – రామారెడ్డి, జూలై 22

# మృత శిశువుతో ఆర్డీవో ఆఫీస్ ఎదుట ధర్నా



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బాధితులు

శక్కర్‌నగర్, జూలై 22: వైద్యులు లేకపోవడం, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా చిన్నారి మృతి చెందిందని బాధిత కుటుంబ సభ్యులు సోమవారం బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఆచన్‌పల్లికి చెందిన షేక్ మోసిన్ భార్య కు పురిటి నొప్పులు రావడంతో సోమవారం ఉదయం 11 గంటలకు బోధన్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అయితే, సాధారణ ప్రసవం కోసం దవాఖానలో చేర్చుకున్న అక్కడి సిబ్బంది నాలుగు గంటల పాటు ఉంచుకున్నారు. పురిటినొప్పులు ఎక్కువై గర్భిణి తీవ్రంగా ఇబ్బంది పడుతుండడంతో ఆమెను నిజామాబాద్ దవాఖానకు తరలించాలని వైద్య సిబ్బంది చెప్పారు. స్థానికంగా వైద్యురాలు లేకుండా ఎందుకు చేర్చుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు.. హుటాహుటిన స్థానిక ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. గర్భిణి పరిస్థితి విషమంగానే ఉందని ముందుగానే తెలిపిన అక్కడి వైద్యులు శస్త్రచికిత్స చేయగా, గర్భంలోనే శిశు వు మృతి చెందింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, బంధువులు చిన్నారి మృతదేహంతో ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించారు. స్థానికంగా మహిళా వైద్యురాలు లేని కారణంగా ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని మండిపడ్డారు. సమాచారమందుకున్న సీఐ వీరయ్య అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు చేపడతారని హామీ ఇవ్వడంతో వారు చిన్నారి మృతదేహంతో వెళ్లిపోయారు.